- సీఎం కేసీఆర్ చేసిన అభివృద్ధి వైపే ఓటర్ల మొగ్గు
- ప్రగతి పరుగులతో గెలుపు నల్లేరుమీద నడకే..
- ప్రచారంలో దూసుకెళ్తున్న గులాబీదండు
- కారెక్కుతున్న ప్రతిపక్ష పార్టీల నాయకులు
- కాంగ్రెస్ కోటకు బీటలు కొట్టిన బీఆర్ఎస్
- విలక్షణ తీర్పులకు నియోజకవర్గానికి పెట్టింది పేరు

# కల్వకుర్తి గడ్డ గులాబీకి అడ్డా


కల్వకుర్తిలోని మున్సిపాలిటీ కార్యాలయం

కల్వకుర్తి, నవంబర్ 1 : కల్వకుర్తి నియోజకవర్గంలో గులాబీ పార్టీ క్రమంగా పుంజుకుంటున్నది. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయి. సీఎం కేసీఆర్ సహకారంతో ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ నియోజకవర్గ అభివృద్ధికి శయాశక్తులా కృషి చేస్తున్నారు. అభివృద్ధి, సం క్షేమం పరుగులు పెడుతుండడంతో ప్రజలంతా బీఆర్‌ఎస్‌వైపు చూస్తున్నారు. 1952లో కల్వకుర్తి నియోజకవర్గం ఏర్పాటయ్యింది. 1952 నుంచి 1962 వరకు రెండు పర్యాయాలు జనరల్, ఎస్సీ రిజర్వుడు ద్విసభ నియోజకవర్గంగా ఉంది. 1952, 1957లో ద్విసభా నియోజకవర్గంలో భాగంగా ఎన్నికలు జరిగాయి. 1952 నుంచి 2018 వరకు నియోజకవర్గంలో 17సార్లు అసెంబ్లీ నియోజకవర్గం ఎన్నికలు జరిగాయి. మూడు పర్యాయాలు స్వతంత్రులు విజయం సాధించడం చరిత్రగా ఉంది. కాంగ్రెస్, టీడీపీ హవా సాగుతున్న సమయంలో కూడా ఇక్కడి ఓటర్లు స్వతంత్ర అభ్యర్థులనే ఆదరించారు.

**రెండు జిల్లాల్లో విస్తరించిన నియోజకవర్గం..**

కల్వకుర్తి నియోజకవర్గం ప్రస్తుతం రెండు నియోజకవర్గాల్లో విస్తరించి ఉంది. నాగర్‌కర్నూల్ జిల్లాల్లో మూడు మండలాలు, రంగారెడ్డి జిల్లాలో 4 మండలాల్లో ఈ నియోజకవర్గం విస్తరించి ఉన్నది. 1952లో నియోజకవర్గం ఏర్పడగా, ప్రజలు ఇచ్చిన తీర్పులు పార్టీల గుర్తుల కంటే వ్యక్తిగతాన్ని చూసి ఓటేశారనే విషయం స్పష్టం చేస్తున్నాయి. 2009 ఎన్నికలకు ముందు ఈ నియోజకవర్గం 7మండలాలతో ఉండేది. నియోజకవర్గాల పునర్విభజనలో కల్వకుర్తి ముఖచిత్రం మారిపోయింది. నియోజకవర్గంలో భాగంగా ఉన్న వంగూర్ మండలాన్ని అచ్చంపేట నియోజవర్గంలో, మిడ్జిల్ మండలాన్ని జడ్చర్ల నియోజకవర్గంలో విలీనం చేశారు. అచ్చంపేట నియోజకవర్గం పరిధిలో ఉన్న కల్వకుర్తి మండలంలోని గ్రామాలను తిరిగి కల్వకుర్తి నియోజకవర్గంలో చేర్చారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత పరిపాలనా సౌలభ్యం కోసం 2016లో జిల్లాల పునర్విభజనలో భాగంగా కల్వకుర్తి నియోజకవర్గంలో ఆమనగల్లు, తలకొండపల్లి మండలాల నుంచి కొన్ని గ్రామాలను తీసుకుని కొత్తగా కడ్తాల్ మండలాన్ని ఏర్పాటు చేశారు. ఆమనగల్లు, కడ్తాల్, తలకొండపల్లి, మాడ్గుల మండలాలను రంగారెడ్డి జిల్లాలో కలిపారు. అదేవిధంగా వెల్దండ మండలంలోని కొన్ని గ్రామాలను అచ్చంపేట నియోజకవర్గంలోని వంగూర్ మండలంలో. కొన్ని గ్రామాలతో చారకొండ మండలాన్ని ఏర్పాటు చేశారు.

**మొత్తం 2,30,650 ఓటర్లు..**

కల్వకుర్తి నియోజకవర్గంలో ప్రస్తుతం 2.30,650 మంది ఓటర్లు ఉన్నారు. అందులో 1,17,393 మంది పురుషులు, 1,13,250 మంది స్త్రీలు, ఇతరులు 7గురు ఉన్నారు. వీరు తమ ఓటు హక్కు వినియోగించుకోవడానికి ఏడు మండలాల పరిధిలో 262 పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేశారు.

**నియోజకవర్గ ప్రత్యేకతలు..**

కల్వకుర్తి నియోజకవర్గానికి చాలా ప్రత్యేకతలు ఉన్నాయి. రాజకీయ చైతన్యానికి ఈ నియోజకవర్గాన్ని పుట్టినిల్లుగా చెబుతారు. ఈ నియోజవర్గానికి తూర్పు దిక్కులో నల్లగొండ, ఉత్తరం దిశలో రంగారెడ్డి జిల్లా, పరమడ దిశలో మహబూబ్‌నగర్ జిల్లాలు సరిహద్దులుగా ఉన్నాయి. కల్వకుర్తి నియోజకవర్గంలో ఇద్దరు మంత్రులుగా పనిచేశారు. 1962లో స్వతంత్ర అభ్యర్థిగా గెలుపొందిన లట్టుపల్లి వెంకటరెడ్డి బూర్గుల రామకృష్ణారావు మంత్రి వర్గంలో, 1989లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గెలుపొందిన జక్కుల చిత్తరంజన్‌దాస్, కోట్ల విజయభాస్కర్‌రెడ్డి మంత్రి వర్గంలో మంత్రులుగా పనిచేశారు.

⇨ 1989లో ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థిగా పోటీ చేసిన చిత్తరంజన్‌దాస్ తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు ఎన్టీరామారావును 3,568 ఓట్ల తేడాతో ఓడించారు.

ఉత్తమ పార్లమెంటేరియన్ అవార్డు గ్రహీత సూదిని జైపాల్‌రెడ్డి కల్వకుర్తి నియోజక వర్గం నుంచి నాలుగు సార్లు వరుసగా భారీ మెజార్టీతో గెలుపొందారు..

⇨ 17సార్లు జరిగిన ఎన్నికల్లో వరుసగా 4సార్లు సూదిని జైపాల్‌రెడ్డి విజయం సాధిస్తే, 2సార్లు చిత్తరంజన్‌దాస్ విజయం సాధించారు.

⇨ హైదరాబాద్‌కు కల్వకుర్తి 90 కిలోమీటర్ల లోపు ఉండటం వల్ల విద్యా, ఉపాధి కోసం 20శాతం వరకు హైదరాబాద్‌లో నివసిస్తుంటారు.

**బీఆర్‌ఎస్ కంచుకోటగా మారనున్న కల్వకుర్తి..**

తెలంగాణ ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత కల్వకుర్తి నియోజకవర్గ రూపురేఖలు పూర్తి స్థాయిలో మారిపోయాయి. రాష్ట్ర రాజధానికి కల్వకుర్తి నియోజకవర్గం దగ్గరగా ఉన్న నేపథ్యంలో రియల్ ఎస్టేట్ ఊపందుకుంది. రియల్ ఎస్టేట్ ఊపందుకోవడంతో ఉపాధి అవకాశాలు కూడా గణనీయంగా పెరిగిపోయాయి. కల్వకుర్తి ఎత్తిపోతల ద్వారా దాదాపు 70వేల ఎకరాలకు ప్రత్యక్షంగా, పరోక్షంగా సాగునీరు అందుతుండటంతో వ్యవసాయం చాలా బలోపేతంగా మారింది. వ్యవసాయ, వ్యవసాయేతర భూముల ధరలు అమాంతం పెరగడంతో కల్వకుర్తి నియోజకవర్గం మొత్తం నాగరీకరణగా వైపు పరుగులు పెడుతున్నది. నియోజకవర్గం నుంచి మూడు జాతీయ రహదారులు వెళ్తుండటంతో పెరిగిన రవాణా సౌకర్యాలతో కల్వకుర్తి కొత్త సొగసులు అద్దుకున్నది. తెలంగాణ రాష్ట్రం రావడం, బీఆర్‌ఎస్ అధికారం చేపట్టిన తర్వాతనే గణనీయమైన అభివృద్ధి సాధించడంతో నియోజకవర్గ వాసులు బీఆర్ఎస్ వైపు మొగ్గు చూపుతున్నారు.

**నాలుగోసారి గెలుపు కోసం..**

కల్వకుర్తి నియోజకవర్గంలో గతంలో కాంగ్రెస్ పార్టీ ఎంత బలంగా ఉందో..ఇప్పుడు అంతకు రెట్టింపు స్థాయిలో బీఆర్‌ఎస్ బలంగా ఉంది. ప్రజల్లో బీఆర్‌ఎస్ పార్టీకి ఉన్న క్రేజ్ అంతా ఇంతా కాదు. ఈ నేపథ్యంలో వస్తున్న అసెంబ్లీ ఎన్నికల్లో నాలుగవ సారి గెలుపుకోసం బీఆర్‌ఎస్ అభ్యర్థి, ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ ఉవ్విళూరుతున్నారు. కడ్తాల్ మండలం చల్లంపల్లికి చెందిన జైపాల్‌యాదవ్ ఇప్పటికే కల్వకుర్తి నుంచి 3సార్లు ఎమ్మెల్యేగా గెలుపొందారు. బలమైన యాదవ సామాజిక వర్గానికి చెందిన జైపాల్‌యాదవ్‌ను మరోసారి బీఆర్‌ఎస్ పార్టీ బరిలో దింపి ప్రతిపక్ష పార్టీల అభ్యర్థులకు కంటి మీద కునుకులేకుండా చేసింది. అభివృద్ధి, సంక్షేమ పథకాలకు తోడు బలమైన సామాజిక వర్గానికి చెందిన అభ్యర్థి తోడు కావడంతో బీఆర్‌ఎస్ అభ్యర్థి విజయం నల్లేరు మీద నడకగా మారనున్నది. 2018లో బీఆర్‌ఎస్ నుంచి గెలుపొందిన ఎమ్మెల్యే జైపాల్‌యాదవ్ బీఆర్‌ఎస్ ప్రభుత్వ సహకారంతో చేపట్టిన అభివృద్ధి పనులు ఆయన గెలుపుకు సోపానాలుగా మారనున్నాయి. మిషన్ భగీరథతో తాగునీరు, మిషన్ కాకతీయ ద్వారా చెరువులకు మరమ్మతు, కృష్ణా సాగునీరు, తండాలకు నూతన గామ పంచాయితీలు, బీటీ రోడ్లు, ప్రతి ఇంటికీ ఏదో ఒక సంక్షేమ పథకం, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్, సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు ఇలా ఎన్నో సంక్షేమ పథకాలతో ఆర్థిక సమృద్ధి సాధించిన కల్వకుర్తివాసులు బీఆర్‌ఎస్ అభ్యర్థిని భారీ మెజార్టీతో గెలిపిస్తామనే చెబుతున్నారు.


యువకులు బంధించిన భారీ మొసలి

## మొసలిని బంధించిన యువకులు

అమరచింత, నవంబర్1: పట్టణ శివారులోని మరికల్ ప్రధాన రహదారిపై అర్ధరాత్రి భారీ మొసలి సంచరించడంతో ఇద్దరు యువకులు మోటర్‌బైక్‌లపై వెళ్తుండగా పసిగట్టడంతో మొబైల్ లైట్ వెలుతురులో మొసలిని తాళ్లతో బంధించిరని అమరచింత ఎస్సై జగన్‌మోహన్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరచింత పెద్ద చెరువులో చాలా రోజులుగా రెండు, మూడు భారీ మొసళ్లు సంచరిస్తూ గేదెలను, గొర్రెలను, మేకలను తింటుండడంతో పాడిపుల కాపారులు భయభ్రాంతులకు గురువుతున్నారని తమకు సమాచారం తెలిసిందని అన్నారు. కాగా మంగళవారం అర్ధరాత్రి అమరచింత పెద్ద చెరువు నుంచి 11, 32 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్ మీదుగా దాదాపు పది అడుగుల పొడవు, మూడు క్వింటాల్‌కు పైగా బరువు ఉన్న భారీమొసలి రోడ్డు దాటుతుండగా అటుగా సొంత గ్రామం పాంరెడ్డిపల్లెకు మోటర్‌బైక్‌పై వెళ్తున్న వాల్మీకి రాజు, వెంకటేశ్ తళ్లతో మొసలిని బంధించి మున్సిపల్ చైర్‌పర్సన్ మంగమ్మ, మార్కెట్ కమిటీ మాజీ వైస్‌చైర్మన్ నాగభూషణంగౌడ్, పోలీసులకు సమాచారం అందించారు. ఈవిషయం జిల్లా కేంద్రంలో అధికారులకు తెలుపగా, డీఎఫ్ఓ ఆదేశంతో స్నేక్ సొసైటీ సభ్యులు కృష్ణసాగర్, గోపాల్, నరేందర్ అమరచింతకు చెరుకుని మొసలిని యువకుల సహయంతో వాహనంలో తీసుకెళ్లి మండలంలోని ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టులో వదిలివేశారు. యువకులు వాల్మీకి రాజు, వెంకటేష్‌ను ఎస్సై జగన్‌మోహన్, పలువురు అభినందించారు.

- అలంపూర్ కాంగ్రెస్ కంచుకోటను బద్దలుకొట్టిన కారు
- అభివృద్ధి, సంక్షేమంలో ముందడుగు
- ఎత్తిపోతల పథకాలతో సాగునీరు
- విద్యా, వైద్యానికి ప్రాధాన్యం
- మెరిసిపోతున్న పల్లె, పట్టణాలు
- గులాబీ జెండాకు జై కొడుతున్న జనం

# అభివృద్ధి పరుగులు

అలంపూర్, నవంబర్ 1: అభివృద్ధికి ఆమడదూరంలో ఉన్న అలంపూర్‌ను గులాబీ పార్టీ అధికారంలోకి వచ్చాక రూపురేఖలు మారిపోయాయి. తక్కువ కాలంలో ఊహించని అభివృద్ధి చేపట్టి ప్రజలకు ఏండ్లుగా నెలకొన్న సమస్యలను పరిష్కారం చేసింది. తాగు, సాగునీటితో పాటు విద్యా, వైద్యం, పల్లె, పట్టణాల్లో అభివృద్ధి పరుగులు పెట్టింది. అలంపూర్ నియోజకవర్గంలో కాంగ్రెస్, బీజేపీ పార్టీలకు కంచుకోటగా ఉన్న అలంపూర్ నియోజకవర్గంలో 2018 ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో బీఆర్‌ఎస్ పార్టీ విజయం సాధించింది. గతంలో ఏ పార్టీ ఎమ్మెల్యేకు ఇవ్వని మెజార్టీ ఈ ఎన్నికల్లో ప్రజలు బీఆర్‌ఎస్ అభ్యర్థికి ఇచ్చి గత రికార్డులను బద్దలుకొట్టారు. 1952లో అలంపూర్ నియోజకవర్గం ఏర్పడింది. 11 పర్యాయాలు కాంగ్రెస్ అభ్యర్థి, ఒకసారి జనతాపార్టీ అభ్యర్థి, రెండుసార్లు టీడీపీ, మూడుసార్లు బీజేపీ, ఒకసారి స్వతంత్ర్య అభ్యర్థి విజయం సాధించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత 2018 ఎన్నికల నుంచి అలంపూరు నియోజకవర్గం బీఆర్‌ఎస్ పార్టీకి కంచుకోటగా మారింది. నియోజకవర్గంలో ఎక్కువ శాతం ఎంపీపీలు, జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచులు బీఆర్‌ఎస్ పార్టీకి సంబంధించిన వారే ఉన్నారు. 2018 ఎన్నికల్లో బీఆర్‌ఎస్ పార్టీ నుంచి డాక్టర్ వీఎం అబ్రహం కాంగ్రెస్ పార్టీ బలపర్చిన సంపత్‌కుమార్‌పై 44వేల ఓట్ల మెజార్టీతో విజయం సాధించారు.

**బీఆర్‌ఎస్‌తోనే అభివృద్ధికి పునాది..**

అలంపూర్ నియోజకవర్గాన్ని దాదాపుగా అరశతాబ్దం పాటు పాలించిన కాంగ్రెస్ పార్టీ ఏమాత్రం అభివృద్ధి చేయలేదు. ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నచందంగా ఉన్నది. అలంపూర్ నియోజకవర్గం ఉమ్మడి రాష్ట్రంలో మొదటి నుంచి అభివృద్ధిపరంగా వెనుకబడింది. ప్రత్యేక తెలంగాణ ఏర్పడిన తర్వాత అభివృద్ధికి పునాదులు పడ్డాయి. 2018లో తెలంగాణ ప్రభుత్వం రెండోసారి అధికారం చేపట్టిన సందర్భంలో అధికార పార్టీ ఎమ్మెల్యే పదవిలో ఉండటంతో అభివృద్ధి పరుగులు తీసింది. కొత్త మున్సిపాలిటీలు ఏర్పడ్డాయి. మున్సిపాలిటీల్లో అభివృద్ధి పనులకు కోట్లలో (ఒక్కో మున్సిపాలిటీకి రూ.35 కోట్లు) నిధులు మంజూరయ్యాయి. పట్టణ ప్రగతి, పల్లెప్రగతితో గ్రామాలు, పట్టణాలు ఊహించని విధంగా అభివృద్ధి పథంలో దూసుకెళ్లాయి. అభివృద్ధిలో రాష్ట్ర, కేంద్ర స్థాయిలో అవార్డులు కూడా పలు గ్రామాలకు వచ్చాయి. పల్లెప్రగతిలో భాగంగా ఇంటింటికీ కుళాయిలు, పల్లెప్రకృతి వనాలు, డ్రైయినేజీలు, నర్సరీలు, వైకుంఠధామాలు, సీసీరోడ్లు, డంపింగ్ యార్డులు, సెగ్రిగేషన్ షెడ్లు, పంట కల్లాలు, పంచాయతీలకు కొత్త భవన నిర్మాణాలు, రైతువేదికలు తదితర కార్యక్రమాలు చేపట్టడంతో గ్రామీణ ప్రాంతంలో అభివృద్ధి పరుగులు పెట్టింది. పట్టణాల్లో సెంట్రల్ లైటింగ్ కం డివైడర్, అండర్‌గ్రౌండ్ డ్రైనేజీలు, సీసీ రోడ్లు, మౌలిక సదుపాయాల కల్పించారు. నియోజకవర్గంలో పేదలకు కార్పొరేట్ వైద్యం అందించేదుకు వంద పడకల దవాఖాన, డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేశారు. చివరి ఆయకట్టుకు సాగునీరందించే ప్రయత్నంలో రూ.786 కోట్లతో తుంగభద్రా నదిపై తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం మొదటి దశ పనులు పూర్తయ్యాయి. 2018 ఎన్నికల ముందే సాగు నీరందించింది. రెండో దశ పనులకు పరిపాలన అనుమతులు వచ్చాయి. రెండో దశ పనులు పూర్తయితే అలంపూర్ నియోజకవర్గంలో చివరి ఆయకట్టు వరకు పుష్కలంగా సాగునీరందుతుంది. రెండు రాష్ట్రాల మధ్య మెరుగైన రవాణా సౌకర్యం కోసం నాగల్‌దిన్నె-పులికల్ గ్రామాల మధ్య వంతెన నిర్మాణం, అలంపూర్ క్షేత్రం నుంచి శ్రీశైలం క్షేత్రానికి వెళ్లేందుకు, అలంపూర్ మండలంలోని నది ఆవలి గ్రామాల ప్రజలకు రవాణా సౌకర్యం కల్పించేందుకు అలంపూరు – ర్యాలంపాడు గ్రామాల మధ్య రూ.35కోట్లతో వంతెన నిర్మాణం చేపట్టడం జరిగింది. కర్ణాటక నుంచి తెలంగాణ వరకు రెండు వరుసల రహదారి ఏర్పాటు, ఇటీవలి కాలంలో ఎర్రవల్లి మండలంలో విజయవర్ధిని ఆయిల్ మిల్ అభివృద్ధి పనులకు మంత్రి నిరంజన్‌రెడ్డి శంకుస్థాపన చేయడం జరిగింది. గతంలో ప్రభుత్వాలు చేయనంతగా సీఎం కేసీఆర్ హయాంలో అభివృద్ధి చేపట్టడంతో ప్రజలంతా గులాబీ పార్టీకి జై కొడుతున్నారు.


అలంపూర్ తాసిల్దార్ కార్యాలయం

**బీఆర్‌ఎస్ అభ్యర్థికి అనుకూలించే అంశాలు..**

అలంపూర్‌లో గతంలో ఏ పార్టీ చేయని అభివృద్ధిని బీఆర్‌ఎస్ పార్టీ పదేండ్లలోనే చేసింది. విద్యా, వైద్యం, పల్లె, పట్టణాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో ప్రాధాన్యతను ఇచ్చి అభివృద్ధి పనులు చేపట్టడం జరిగింది. ప్రతి మండలానికి కస్తూర్బాగాంధీ, ప్రభుత్వ కాలేజీలు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పల్లె దవాఖానాలు, సబ్ సెంటర్లు, రహదారులు, ప్రతి కాలనీలో సీసీ రోడ్లు నిర్మించారు. తుమ్మిళ్ల ఎత్తిపోతలతో సాగునీరు, వంద పడకల దవాఖానాతో పాటు అనేక అభివృద్ధి పనులు చేపట్టి అలంపూర్ అభివృద్ధి పరుగులు పెడుతున్నది. దీంతో ప్రజలంతా బీఆర్‌ఎస్‌కు అండగా నిలుస్తున్నారు. సీఎం కేసీఆర్‌కే మా ఓటు అంటూ స్వచ్ఛందంగా మద్దతు తెలుపుతున్నారు.